పట్నం బతుకమ్మలకు పల్లె పూలు

- వరంగల్, హనుమకొండలో విక్రయం
- ఉపాధి పొందుతున్న గ్రామీణ ప్రజలు

దుగ్గొండి : సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఏటా పల్లె పూలన్నీ పట్నం బాటపడుతాయి. గ్రామాల నుంచి తరలివచ్చిన తీరొక్కపూలతో పట్టణ రోడ్లు పరవశిస్తాయి. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలు వారం రోజుల పాటు గునుగు, తంగేడు, బంతి, చామంతి, సీతమ్మ జడపూలు, టేకు, గుమ్మడి ఇలా అనేక రకాల పూలను సేకరిస్తారు. గుమ్మడి ఆకులను సైతం సేకరించి కట్టలుగా కట్టి రంగులు అద్ది ఆరబెడతారు. పూలను సద్దుల బతుకమ్మకు ఒకరోజు ముందు వరంగల్, హనుమకొండ పట్టణాలకు తీసుకెళ్లి విక్రయించుకుని ఉపాధి పొందుతున్నారు. ఇలా పల్లెవాసులు సేకరించిన పూలతో పట్టణ వాసులు బతుకమ్మలు పేర్చుకుంటారు. మండలంలోని నాచినపల్లి, తొగర్రాయి, వెంకటాపురం, పొనకల్ గ్రామాల నుంచి వందలాది కుటుంబాలు పూలతో పట్టణాలకు శనివారం పయనమై వెళ్లాయి.



బంతిపూలు సేకరిస్తున్న రైతులు



పల్లె నుంచి పట్నానికి వాహనంలో పూలు తరలిస్తున్న మహిళ

25 ఏళ్లుగా పూలు అమ్ముతున్నా..



బతుకమ్మ వచ్చిందంటే మాకు సంబురంగా ఉంటది. గ్రామంలో చాలా మంది కలిసి పూలు తెచ్చుకుంటాం. వాటిని పట్నం తీసుకెళ్తాం. నేను వరంగల్ చౌరస్తాలో అమ్ముకుంటా. పట్నపోళ్ల బతుకమ్మలకు నా పూలు ఇచ్చిన అనే తృప్తి మిగులుతుంది. 25 ఏళ్ల నుంచి పట్నంల పూలు అమ్ముతున్నా. – విజయ, నాచినపల్లి

అమరుల ప్రాణత్యాగాలు వృథా కావు

నర్సంపేట రూరల్ : విధి నిర్వహణలో ఎంతోమంది ప్రాణత్యాగాలు చేశారని, వారి ప్రాణత్యాగాలు వృథా కావని వారి ఆశయాలను కొనసాగించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తామని స్థానిక ఏసీపీ తిరుమల్ అన్నారు. పట్టణంలోని పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ రోడ్డు వరకు పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రాతిర క్రొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పోలీస్ అమరవీరుల జోహార్లు అంటూ నినాదాలు చేసుకుంటూ నర్సంపేట పోలీస్‌స్టేషన్ నుంచి వరంగల్ రో డ్డు అమలరవీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నర్సంపేట టౌన్, రూరల్ సీఐలు సుంకరి రవికుమార్, కిషన్, నర్సంపేట డి విజన్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ఓబీసీలంతా ఏకమైతే రాజ్యాధికారమే



సంగెం: రాష్ట్రంలో అధికశాతం ఉన్న ఓబీసీలంతా ఏకమైతే రాజ్యాధికారం సొంతమవుతుందని బీజేపీ రాష్ట్రనాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు అన్నారు. శనివారం మండలంలోని ఆశాలపల్లి కూచన గార్డెన్‌లో ఓబీసీల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ నేడు కేసీఆర్ కుటుంబం చేతిలో బంధి అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ దోపిడీ పాలనను అంతం చేసి బంగారు తెలంగాణ సాధన కోసం బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, డాక్టర్ జగదీశ్వరప్రసాద్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ గౌడ్, కన్నెబోయిన రాజయ్య యాదవ్, పూజారి సత్యనారాయణ. బుట్టి కుమారస్వామి, వాసం సురేష్, గోదాసి చిన్న, బెజ్జంకి శేషాద్రి, రహమతుల్లా, చంద్రమౌళి, కృష్ణ, కిశోర్ పాల్గొన్నారు.

గిరిజనుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

నర్సంపేట : వచాతి గిరిజనుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలో వర్గ, సామాజిక అణచివేతలపై పోరాడాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోరబోయిన కుమారస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వచాతి వీర మహిళల అభినందన సభ శనివారం బెంబేలి మలహల్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ 1992లో తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లాలో ఆదివాసి గిరిజన గ్రామం వచాతిపై ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతుందనే నెపంతో పోలీసు, అటవీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పురుషులపై దాడి చేయడమే కాకుండా, పదుల సంఖ్యలో మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారన్నారు. బాధిత మహిళలు, గిరిజనులకు అండగా తమిళనాడు గిరిజన సంఘం, ఐద్వా, ఏఐకేఎస్, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం తదితర వామపక్ష ప్రజాసంఘాల సుదీర్ఘ పోరాటంతో దాదాపు 215 మంది దోషులకు మద్రాస్ హైకోర్టు శిక్ష విధించి బాధిత గిరిజన మహిళలకు న్యాయం చేసిందన్నారు. ఈ తీర్పు దేశంలోని దళిత గిరిజన, బడుగు బలహీన వర్గాలకు బలం చేకూరుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, ఎస్‌కె.అన్వర్, పెండ్యాల సారయ్య, హన్మకొండ సంజీవ, వజ్జంతి విజయ, బిట్ర స్వప్న, ఉదయగిరి నాగమణి, బి.లక్ష్మి, పాతకాల బాబు, గణిపాక విలియం కేరి, నర్సింహారాములు, పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ.. తప్పిన పెనుప్రమాదం

వర్ధన్నపేట: ఓ కారు రోడ్డు క్రాస్‌చేస్తుండగా మరో కారు అతి వేగంగా వచ్చి ఢీ కొట్టిన సంఘటన శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ నుంచి వస్తున్న కారు వర్ధన్నపేట అంబేడ్కర్ సెంటర్ వద్ద జఫర్‌గఢ్ వైపునకు వెళ్లడానికి రోడ్డు క్రాస్ చేస్తుండగా ఖమ్మం నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న మరో కారు ఢీ కొట్టడంతో కారు ముందు భాగం దెబ్బతింది. ఎవరికీ ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

బాధిత కుటుంబాలకు పలువురి పరామర్శ



సంగెం : ఎల్గూర్‌రంగంపేటలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చల్లా



దుగ్గొండి: ప్రవల్లిక తల్లిని ఓదారుస్తున్న జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న

గీసుకొండ: మండలంలోని పలు బాధిత కుటుంబాలను, అనారోగ్యంతో, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం పరామర్శించారు. ధర్మారం, గొర్రెకుంటలో పలు కారణాలతో మృతి చెందిన గంగుల అరుణ్, బండి దివ్య, గజ్జి సుందర్, జన్ను సిద్దు, ఇండ్ల యాకయ్య, శ్రీరాముల కట్టమ్మ, కంజర్ల మరియమ్మ కుటుంబాలను పరామర్శించారు. అలాగే పోతరాజుపల్లి, ధర్మారంలో అనారోగ్యంతో బాధపడుతున్న వీరమల్లు, పద్మ కుటుంబాలను, గీసుకొండ మాజీ సర్పంచ్ కుమారస్వామి తల్లి వరలక్ష్మి మృతి చెందగా ఆమె బంధువులను, కొనాయమాకులలో అనారోగ్యంతో బాధపడుతున్న సాంబరాజు, యాదగిరి, అశోక్ కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంగెం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం సందర్శించి పరామర్శించారు. ఎల్గూర్ రంగంపేటలో ఇటీవలి కాలంలో మృతి చెందిన సాంబరాజు పద్మ, శాబోతు లక్ష్మి, గవిచర్లలో లింగాల తిరుపతిరెడ్డి, మేరుగు చంద్రమౌళి, గూడ లక్ష్మి తదితర బీఆర్ఎస్ కుటుంబాలను సందర్శించి మృతుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తి: ఆర్థికసాయం అందిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

ప్రవల్లిక కుటుంబానికి పరామర్శ

దుగ్గొండి: మండలంలోని బిక్కాజీపల్లికి చెందిన మర్రి ప్రవల్లిక 10 రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుంది. శనివారం దశదినకర్మ కార్యక్రమానికి జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న హాజరై ప్రవల్లిక తల్లి విజయను ఓదార్చారు. ఆమె వెంట జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, నర్సంపేట మార్కెట్ చైర్మన్ పొన్నం మొగిలి, ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, సర్పంచ్ సింగనబోయిన భాగ్యలక్ష్మీలింగయ్య ఉన్నారు.

రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన ఐత యాకూబ్ అనారోగ్యంతో మృతి చెందగా శనివారం అంబేడ్కర్ సంఘం నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుడి కుటుంబానికి రూ.18,500 ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీ ఐత రాంచందర్, ఐత బ్రహ్మం, కుమార్, సంపత్, మల్లేష్, రాజు, సీఏ యాకయ్య, రాజేష్ ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన పెట్రోల్ ట్యాంకర్

ఖానాపురం: ప్రమాదవశాత్తు మట్టి ట్రాక్టర్‌ను పెట్రోల్ ట్యాంకర్ ఢీకొట్టిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సంపేట నుంచి మహబూబాబాద్ వైపు పెట్రోల్‌టాంకర్ వెళ్తుంది. ఈ క్రమంలో గూడూరు మండల పరిధి నుంచి ఖానాపురం వచ్చిన మట్టి ట్రాక్టర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో బోల్తాపడగా ట్యాంకర్ పక్కనే డివైడర్ వద్దకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

కాంగ్రెస్ సీటు రజకులకే కేటాయించాలి

రాయపర్తి: కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి సీటు రజకులకే కేటాయించాలని మధ్యప్రదేశ్ ఓబీసీ ఇన్‌చార్జ్, ఏఐసీసీ నేషనల్ జాయింట్ కోఆర్డినేటర్ ఉల్లెంగుల యాదగిరి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ టికెట్‌కోసం తెలంగాణ అసెంబ్లీ ఎలక్షన్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ కేరళ వడాకర్ ఎంపీ కె.మురళీధరన్‌ను కలిసినట్లు తెలిపారు. చాకలి ఐలమ్మ గడ్డ పాలకుర్తి నియోజకవర్గంలో అత్యంత వెనకబడిన ఓట్లు సుమారు 40వేలు ఉన్నందున టికెట్ తనకే వస్తుందన్నారు. 30 ఏళ్ల నుంచి ఆలిండియా స్థాయి వరకు అంచెలంచెలుగా ఎదిగి కాంగ్రెస్‌కు సేవలందించినట్లు తెలిపారు. పాలకుర్తి ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

రథయాత్రను విజయవంతం చేయాలి



వర్ధన్నపేట: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

వర్ధన్నపేట/గీసుకొండ: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో భాగంగా మంద కృష్ణ చేపట్టిన రథయాత్ర ఈ నెల 24న వర్ధన్నపేటకు చేరుకుంటుందని యాత్రను విజయవంతం చేయాలని మండల ఇన్‌చార్జ్ గోలి సుధాకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుముల పూర్ణయ్య పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద రథ యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఎస్సీల ఎబీసీడి వర్గీకరణకు రా బోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలని డిమాండ్ చే శారు. కార్యక్రమంలో నాయకులు మాసాని గోపాల్, చాతల్ల రమేష్, ఉదయ్, ధర్మయ్య, తాళ్ల రమేష్, గోపాల్, రవి, పరంజ్యోతి, నరసయ్య, రాములు, రవి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న పెద్ది స్వప్న, ఎంపీపీ

నర్సంపేట రూరల్ : మండలంలోని గురిజాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించగా ఎమ్మెల్యే సతీమణి, వరంగల్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, ఎంపీపీ మోతె కళావతి, సర్పంచ్ గొడిశాల మమత, ఎంపీటీసీ బండారి శీలత, మోటూరి శ్వేతలు కలిసి బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. పెద్ది స్వప్న, కళావతిని సర్పంచ్ మమత ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాతకు పూజలు



నర్సంపేట : పూజలు చేస్తున్న కౌన్సిలర్, మహిళలు



సంగెం: గవిచర్లలో కుంకుమ పూజలో మహిళలు

నర్సంపేట: పట్టణంలోని పదో వార్డులోని పోచమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత శనివారం ఏడో రోజు శ్రీలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్, మహిళలచే వేద పండితులు నిశాంత్‌శర్మ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొలమెల్ల శ్యామ్‌సుందర్ రాధిక, మద్దెనపల్లి ఉపేందర్–అనిత, నాగిశెట్టి ప్రవీణ్–ప్రణీత, రావుల స్వరూప, తాళ్లపల్లి కళ్యాణి, మామిడాల యాదమ్మ, కవిత, పాల్గొన్నారు. పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు కాళరాత్రి అవతారంలో భక్తులకు దర్శమిచ్చారు. మహిళలచే సామూహిక లలిత సహస్రనామ పారాయణం, కుంకుమపూజ, అనంతరం పల్లకి సేవ నిర్వహించారు. అంచూరి కృష్ణమూర్తి, పిన్న రామనాథం, చంద్రశేఖర్, శ్రీరామ్ ఈశ్వరయ్య, కృష్ణమూర్తి, రవీందర్, పాల్గొన్నారు.

లలిత త్రిపుర సుందరి అలంకరణలో..

సంగెం: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లలిత త్రిపుర సుందరి అలంకరణలో శనివారం దుర్గామాత దర్శనమిచ్చారు. మండలంలోని గవిచర్లలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద పూజారి విశ్వరూప చారి మహిళలతో ప్రత్యేక పూజలు నిర్వహించి కుంకుమ పూజ చేయించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు శశిధర్, దేవేందర్, మహేందర్, ముఖేష్, ఫణి, మహేష్ పాల్గొన్నారు.



రాయపర్తి : అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉషాదయాకర్‌రావు

రాయపర్తి: మండలంలోని వెంకటేశ్వరపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను శనివారం గజలక్ష్మి అవతారంలో అలంకరించినట్లు ఆలయ అర్చకులు ఆరుట్ల రంగాచార్యులు, రమణాచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని రామాలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద కాంచనపల్లి వనజారాణి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు ప్రారంభించారు. ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, సర్పంచ్ గారె నర్సయ్య, డైరెక్టర్ ఎండీ ఉస్మాన్, పాల్వంచ కోటేశ్వర్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, తౌడుశెట్టి రామారావు, పురం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



రాయపర్తి : జెండా ఊపి ప్రారంభిస్తున్న ఉషాదయాకర్‌రావు

రాయపర్తి: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు కోరారు. పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన డ్రైవింగ్ స్కూల్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 200 కార్లతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు. శని వారం మండలంలోని శివరామపురం గ్రామానికి ర్యాలీ చేరుకోవడంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, సర్పంచ్ చెడుపాక కుమారస్వామి,సంతోష్‌గౌడ్, జగన్, శ్రీనివాస్‌రెడ్డి, సోమన్న, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దిని గెలిపిస్తే మరింత అభివృద్ధి

ఖానాపురం : ఎమ్మెల్యేగా పెద్ది సుదర్శన్‌రెడ్డిని మరోసారి గెలిపిస్తే నర్సంపేట రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య అన్నారు. మండలంలోని కొత్తూరుతో పాటు పలు గ్రామాల్లో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూస రమ, అశోక్‌యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జెరిపోతుల వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'చల్లా'ను లక్ష మెజారిటీతో గెలిపించాలి

గీసుకొండ : అసెంబ్లీ ఎన్నికల్లో చల్లా ధర్మారెడ్డిని లక్ష మెజారిటీతో గెలుపొందే విధంగా ప్రతీ కార్యకర్త, యువకులు కృషి చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు జూలూరి లెనిన్‌గౌడ్ అన్నారు. శనివారం సాయంత్రం నంద నాయక్‌తండాలో సేవాలాల్ యూత్ కమిటీ, బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు అఖిల్, నర్సింహ, రమేశ్, వీరన్న, యూత్ అధ్యక్షులు రవీందర్, బాదావత్ వెంకన్న, పాల్గొన్నారు.



ఖానాపురం : మాట్లాడుతున్న వెంకటనర్సయ్య



గీసుకొండ : మాట్లాడుతున్న లెనిన్‌గౌడ్

బీఆర్ఎస్ వైపే యువత చూపు

వర్ధన్నపేట: బీఆర్ఎస్ వైపు యువత చూపు ఉందని బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని బీఆర్ఎస్ జిల్లా యూత్ నాయకుడు, ఎమ్మెల్యే రమేష్ తనయుడు అరూరి విశాల్ అన్నారు. శనివారం మండలంలోని చెన్నారంలో యువజన నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మూడోసారి ఎమ్మెల్యే రమేశ్‌ను గెలిపించాలని కోరారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌ను ఆదరించండి

నెక్కొండ : కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఆదరించాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ కోరారు. స్థానిక నందమూరి నగర్ (ఎస్సీ కాలనీ)లో శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు బండి శివకుమార్, రావుల మహిపాల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కుసుమ చెన్నకేశవులు, నాయకులు ఉపేందర్, సాయికృష్ణ, రాము, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



చెన్నారావుపేట: మండలంలోని పుల్లయ్యబోడుకు చెందిన వార్డు సభ్యులు అజ్మీరా గాగమ్మ, భద్రుతో పాటు 15 కుటుంబాలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, క్లస్టర్ బాధ్యులు మాజీ ఎంపీటీసీ బిళ్ల ఇంద్రసేనారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మంచాల సదయ్య, జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్ రెడ్డి, మంద యాకయ్య, రమేష్, హరీష్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

రాయపర్తి: మండలంలోని మైలారం గ్రామంలో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై పడిన గుంతలను సర్పంచ్ లేతాకుల సుమతియాదవరెడ్డి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బంది గుంతలను పూడ్చారు. సిమెంట్ కాంక్రీట్‌తో పూడ్చినట్లు తెలిపారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

సంగెం: స్థానిక ఊర చెరువు వద్ద సద్దుల బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గుండేటి బాబు, ఎస్సై ఎం.భరత్‌లు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు బతుకమ్మలను నిమజ్జనం చేసేటప్పుడు మెట్లపై నుంచే చెరువులో వేయాలన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది అందుబాటులో ఉంటారని వారితో బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేయించాలన్నారు. చిన్న పిల్లలను చెరువు వద్దకు రాకుండా బతుకమ్మ మైదానం వద్దనే ఉండేటట్లుగా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వారి వెంట నీటి సంఘం మాజీ చైర్మన్ తాటికొండ కిష్టయ్య తదితరులు ఉన్నారు.

అన్నదానం మహాదానం



నెక్కొండ: అన్నదానం మహాదానం అని నెక్కొండ పీఏసీఎస్ చైర్మన్ మారం రాము, సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి అన్నారు. అంబేడ్కర్ సెంటర్‌లోని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దాన గుణం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బొడ్డుపల్లి రాజు, రావుల భాస్కరెడ్డి, మహ్మద్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ప్రతినిధుల హాజరు



నర్సంపేట : ఆధునిక వ్యవస్థలో వస్తున్న మార్పులపై బెంగుళూరులోని ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఇటీవల మూడు రోజుల పాటు అంతర్జాతీయ విద్యా సదస్సు జరిగింది. 30కి పైగా దేశాల నుంచి విద్యావేత్తలు, 20 వేల మంది వివిధ పాఠశాలల ప్రతినిధులు, ఉపాధ్యాయులు హాజరై తమ ఆలోచనలను పంచుకున్నారు. ఈ సదస్సుకు నర్సంపేట గీతాంజలి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ సుబ్బారావు, డైరెక్టర్లు రచన, సాయివిశ్వనాథ్‌బాలాజీ, ప్రతాప్, రామకృష్ణ, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, నాగమల్లేశ్వర్‌రావు హాజరయ్యారు. అలాగే, లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కవి, ఉపాధ్యాయుడు కాసుల రవికుమార్ లీడ్ లైబ్రరీ ఆధ్వర్యంలో ప్రారంభించిన 'హగ్ ఏ బుక్ చాలెంజ్' గురించి వివరించారు.

గుడుంబా స్వాధీనం

గీసుకొండ: మండలంలోని జాన్‌పాకలో గుడుంబా అమ్మకం స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు చేశారు. దాడుల్లో జాన్‌పాకలో కిరాణంషాపు నిర్వహిస్తున్న భూక్య కొమ్మాలు వద్ద నుంచి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, తదుపరి చర్యల నిమిత్తం గీసుకొండ పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు దాడులను నిర్వహించినట్లు ఇన్‌స్పెక్టర్ పెండ్యాల దేవేందర్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ టీం, పోలీసులు పాల్గొన్నారు.